క్లుప్తంగా

సోమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో నిర్వహిస్తున్న హోమం

గూడూరు రూరల్: గూడూరు పట్టణం త్యాగరాజ వీధిలో ఉన్న మీనాక్షిదేవి సమేత సోమేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తదుపరి హోమం చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

అంగరంగ వైభవంగా చెన్నకేశవుని రథోత్సవం



రథం లాగుతున్న మహిళా భక్తులు

చిల్లకూరు: గూడూరు పట్టణం కర్నాలవీధిలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ముందుగా శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామికి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి రథంపై కొలువుదీర్చారు. భక్తుల గోవింద నామస్మరణల మధ్య రథాన్ని లాగారు. రథం లాగడానికి భక్తులు పోటీ పడ్డారు. మహిళలు దారి పొడవునా కొబ్బరికాయలు కొట్టి హారతులు పట్టారు. పట్టణంలో ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ బ్రహ్మోత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఆర్టీసీ బస్టాండు ఆధునికీకరణ

రాపూరు: రాపూరు ఆర్టీసీ బస్టాండును ఆధునికీకరించనున్నట్టు డిపో మేనేజర్ అనీల్‌కుమార్ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ బస్టాండు భవనానికి రంగులు వేయడంతో పాటు ప్రయాణికుల సౌకర్యార్థం కొత్త కుర్చీలు వేశామన్నారు. దాతల సహకారంతో ఆర్‌వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. దాతల సహకారంతో మరిన్ని కార్యక్రమాలు చేపడుతున్నట్టు వివరించారు.

పీహెచ్‌సీకి రెండు బెడ్లు అందజేత



చిల్లకూరు: మండల కేంద్రమైన చిల్లకూరులోని పీహెచ్‌సీకి బుధవారం గూడూరులోని రోటరీ వెస్ట్ క్లబ్ సభ్యులు రెండు బెడ్లు అందజేశారు. వైద్యులు అరాఫత్ మాట్లాడుతూ రోటరీ వెస్ట్ క్లబ్ రోగులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. రోటరీ వెస్ట్ క్లబ్ అధ్యక్షుడు నాశిన నాగులు మాట్లాడుతూ సభ్యులు పీవీ సుధాకర్ రావు, బండి ధనుంజయరెడ్డి దాతృత్వంతో రెండు బెడ్లను అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ రొటేరియన్ ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, క్లబ్ కార్యదర్శి చోళవరం గిరిబాబు, పీఎంరావు, సనత్‌కుమార్‌రెడ్డి, సిద్ధారెడ్డి, డాక్టర్ తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్‌ఈలో ఎల్‌పీపీ విద్యార్థుల హవా



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఎల్‌పీపీ యాజమాన్యం

చిల్లకూరు: సీబీఎస్‌ఈ పదో తరగతి పరీక్షల్లో తమ విద్యార్థులు మంచి మార్కులు సాధించినట్టు చిల్లకూరు సమీపంలోని లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది పరీక్షల్లో 77 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వంద శాతం ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. 57 మంది 80 శాతం మార్కులు సాధించినట్టు తెలిపారు. అందులో 500 మార్కులకుగాను పి.ఆద్యా, పి.వెంకటశరన్ 474 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌లుగా నిలిచారని వివరించారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ సుధేష్ణ, హెచ్‌ఎం సురేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తీరగ్రామాల్లో సోలార్ లైట్లు

చిల్లకూరు: అదానీ క్రిష్ణపట్నం పోర్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అదానీ ఫౌండేషన్ మండలంలోని తీరప్రాంతాల్లో సోలార్ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసేందుకు బుధవారం శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో తమ్మినపట్నం పంచాయతీలోని అదానీ ఫౌండేషన్ హెడ్ రాజేష్ రంజన్ మాట్లాడుతూ తమ్మినపట్నంలో సుమారు 150 సోలార్ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇటీవల గ్రామాల్లోని మత్స్యకార యువత కోరిక మేరకు క్రికెట్ పోటీలు నిర్వహించినట్టు తెలిపారు. అలాగే విద్య, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తమ ఫౌండేషన్ కృషి చేస్తోందన్నారు. కోట సతీష్‌యాదవ్, బక్తాని రామయ్య, మేకల వెంకయ్య, నాగూరు, సుబ్బయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో భవనాలు

శిథిలావస్థలో ఉన్న తహసీల్దార్ కార్యాలయం



ప్రమాదకరంగా ఉన్న ఎంపీడీవో కార్యాలయం



పశువైద్యశాల దుస్థితి





తహసీల్దార్ కార్యాలయ భవనం

చిట్టమూరు: మండలం కేంద్రమైన చిట్టమూరులో వున్న తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు, పశువైద్యశాల, బీసీ సంక్షేమ వసతి గృహం తదితర భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటిని నిర్మించి ఏళ్లు కావడం, మరమ్మతులు చేయకపోవడంతో పైకప్పు పెచ్చులూడి కింద పడుతున్నాయి. కమ్మీ కనిపిస్తోంది. ఎప్పుడు కూలిపోతాయోనని ఉద్యోగులు భయాందోళన చెందుతున్నారు. తహసీల్దార్ భవనం చిన్నపాటి వర్షానికే ఉరుస్తోంది. గోడలు నెమ్మెక్కుతున్నాయి. రికార్డులు తడిసిపోతున్నాయి. ఆదివారం కురిసిన కొద్దిపాటి వర్షానికే మండల పరిషత్ కార్యాలయం ఉరిసింది. బీసీ హాస్టల్ భవనం శిథిలావస్థ చేరడంతో పిల్లలను అక్కడ ఉంచడానికి తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పాత భవనాలను తొలగించి కొత్త భవనాలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

నీటి ఎద్దడి రాకుండా చూడాలి

కోట: గ్రామాల్లో మంచినీటి సమస్య రాకుండా తక్షణం చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీవో వెంకటరమణ ఆదేశించారు. ఆయన బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో నీటి సమస్య తలెత్తే ప్రాంతాలను గుర్తించి ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా గ్రామ పంచాయతీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ఇంటి పన్నుల వసూలు, ఆధార్ అప్‌డేషన్ తదితరాలపై పలు సూచనలు చేశారు. సమావేశంలో ఎంపీడీవో దిలీప్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీవో వేణు పాల్గొన్నారు.

కారు బోల్తాపడి 8 మందికి గాయాలు

పెళ్లకూరు: మండలంలోని అక్కగారిపేట సమీపంలో బుధవారం కారు డివైడర్‌ను ఢీకొని అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఎనిమిది మంది గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. కారు తిరుపతి నుంచి నెల్లూరు వెళుతోంది. మార్గమధ్యంలోని అక్కగారిపేట గ్రామ సమీపంలో కారు డివైడర్‌ను ఢీకొని అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఎమిదిమందికి గాయాలయ్యాయి. వారిని స్థానికులు శ్రీకాళహస్తికి తరలించారు. ప్రమాదంపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

అత్తారింటికి చేరిన పెనుశిల నరసింహుడు





విశేషాలంకరణలో స్వామి, అమ్మవార్లు, స్వామి అమ్మవార్లను గోనుపల్లికి తీసుకెళుతున్న అధికారులు, భక్తులు

రాపూరు: మండలంలోని పెంచలకోనలో ఆరు రోజులపాటు బ్రహ్మోత్సవాలు జరుపుకున్న పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, చెంచులక్ష్మీని పెళ్లి చేసుకుని బుధవారం సతీసమేతంగా అత్తగారిల్లు అయిన గోనుపల్లి గిరిజనవాడకు చేరుకున్నారు. బ్రహ్మోత్సవాలకు ముందు రోజు గోనుపల్లి ఆలయంలో ఉన్న పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పెంచలకోనకు తీసుకెళతారు. ఉత్సవాలు ముగిసిన తర్వాత తిరిగి గోనుపల్లికి తరలించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా బుధవారం కోనలోని క్రేన్ మండపం వద్ద స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో కొలువుదీర్చి వివిధ పుష్పాలు, ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. పెంచలకోన ఆర్చి వద్ద ప్రత్యేక పూజలు చేసి స్వామి, అమ్మవార్లకు వీడ్కోలు పలికారు. గోనుపల్లిలోని గిరిజన కాలనీ వద్ద ఉన్న చెంచురాజు ఇంటికి దొడ్డిదారిలో తీసుకొచ్చారు. శ్రీవారి కల్యాణం అనంతరం స్వామి వారు దొంగదారిలో గ్రామానికి వచ్చారని నానుడి. పెంచలస్వామి గిరిజన వనిత చెంచులక్ష్మీని వివాహం చేసుకోవడంతో ఆయనను తమ అల్లుడిగా భావిస్తారు. గోనుపల్లి నుంచి ఉత్సవ విగ్రహాలు కోనకు వెళ్లే సమయంలో స్వామిని గిరిజనులు పెళ్లి కొడుకును చేసి అల్లుడికి ఇవ్వాల్సిన కట్న కానుకల కింద ఆరిమొలతాడు, ఇంజేటి గడ్డ, పుట్టతేనె మొదలైనవి సమర్పిస్తారు. అలాగే స్వామి తిరిగి వచ్చే సమయంలో అడవి ఫలాలను అందజేయడం ఆనవాయితీ. శ్రీవారు ఉదయం నుంచి సాయంత్రం వరకు గిరిజన కాలనీలోనే ఉంచడంతో గిరిజనులు తమ కొత్త అల్లుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి పండుగ జరుపుకున్నారు. అనంతరం గోనుపల్లిలో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఏసీ శ్రీనివాసులు రెడ్డి, ఫెస్టివల్ కమిటీ సభ్యులు చెన్ను తిరుపాల్‌రెడ్డి, ఉప ప్రధానార్చకులు సీతా రామయ్యస్వామి, పెంచలయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

20న లేబర్ కోడ్ల రద్దు కోరుతూ సమ్మె

సైదాపురం: నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని కోరుతూ 20న దేశవ్యాప్త సమ్మె చేస్తున్నట్టు ఐఎఫ్‌టీయూ జిల్లా నేత రమేష్ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగంలో పొందుపర్చిన కార్మికుల హక్కులు, చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్లను తీసుకువచ్చి అమలు చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు డీపీ పోలయ్య, నేతలు చెంగల్రావు, మమత పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గూడూరు రూరల్: గూడూరు రూరల్ పరిధిలోని యమహా షోరూం సమీపంలో బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. సమాచారం అందుకున్న డీఎస్పీ గీతాకుమారి, రూరల్ పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. అతనికి సుమారు 55 ఏళ్లు ఉంటాయని తెలిపారు. ఎవరైనా గుర్తిస్తే వివరాలను రూరల్ పోలీసులకు 9440796344 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

బైక్ నుంచి పడి మహిళ మృతి



మృతి చెందిన ఎల్లంటి మాధవి

దక్కిలి: మండలం శ్రీపురంలో సమీపంలో బుధవారం బైక్ నుంచి పడి మహిళ మృతిచెందింది. ఎస్‌ఐ శివశంకర్ కథనం మేరకు.. వెంకటగిరి రూరల్ మండలం సిద్ధవరం గ్రామానికి చెందిన ఎల్లంటి మాధవి (38) బంధువులతో కలిసి బైక్‌లో శ్రీపురం బయలుదేరింది. బైక్ నుంచి పడి తీవ్రంగా గాయపడింది. ఆమెను కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వైఎస్సార్ సీపీ నేతలకు కిలివేటి పరామర్శ





అభయ్ రెడ్డిని పరామర్శిస్తున్న సంజీవయ్య, ప్రతాప్ రెడ్డితో మాట్లాడుతున్న కిలివేటి

నాయుడుపేట టౌన్: అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకులు చిల్లకూరు అభయ్ రెడ్డి, కాటంరెడ్డి ప్రతాప్ రెడ్డిని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పరామర్శించారు. ఆయన బుధవారం నాయుడుపేట బీఎంఆర్ నగర్‌లో వున్న వారి స్వగృహాలకు చేరుకున్నారు. ఆరోగ్యంపై ఆరా తీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. నాయకులు మద్దాలి సోమశేఖర్‌రెడ్డి, కటకం జయరామయ్య, బైనా మల్లికార్జున రెడ్డి, దొంతాల రాజశేఖర్ రెడ్డి, పేట చంద్రారెడ్డి, చిల్లకూరు బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనిచేయని స్కానింగ్ మెషిన్



స్కానింగ్ మెషిన్ మరమ్మతులకు గురవడంతో మూసేసిన సెంటర్



ఆర్థోపెడిక్ వైద్య పరీక్షల కోసం క్యూలో ఉన్న దివ్యాంగులు

చిల్లకూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యం అందని ద్రాక్షలా మారింది. దీంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గూడూరు ఏరియా ఆస్పత్రిలో సీటీ స్కానింగ్ మెషిన్ మరమ్మతులకు గురై 15 రోజులు అవుతోంది. సదరన్ క్యాంపులకు వచ్చే దివ్యాంగులు పడుతున్న ఇక్కట్లు అన్ని ఇన్నీ కావు. కూటమి ప్రభుత్వం పింఛన్ల ఏరివేతలో భాగంగా దివ్యాంగుల సదరం సర్టిఫికెట్లను మరోసారి పరిశీలించి కొత్త సర్టిఫికెట్లు తీసుకోవాలని ఆదేశించింది. జిల్లాలోని శ్రీకాళహస్తి, వెంకటగిరి, సూళ్లూరుపేట, గూడూరు, నెల్లూరు జిల్లాలోని కావలి నియోజకవర్గంలోని దివ్యాంగులకు స్లాట్ బుక్ చేసుకుంటే గూడూరులోని సీటీ స్కానింగ్ సెంటర్‌కు రావాలని చూపిస్తోంది. 15 రోజులుగా దివ్యాంగులు ఆయా ప్రాంతాల నుంచి వ్యయప్రయాసలకు ఓర్చుకుని గూడూరుకు వస్తున్నారు. ఇక్కడ స్కానింగ్ మెషిన్ పనిచేయకపోవడంతో దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు మెషిన్ మరమ్మతుల గురించి పట్టించుకోవడం లేదు. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనాను వివరణ కోరగా విద్యుత్ హెచ్చుతగ్గులతో మెషిన్ పాడైందని, రెండు మూడు రోజుల్లో వినియోగంలోకి తీసుకువస్తామని తెలిపారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



మాట్లాడుతున్న ఎంపీపీ విజయలక్ష్మి

చిట్టమూరు: మండలంలో పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు చేయడంతోపాటు ప్రజల సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీపీ సన్నారెడ్డి విజయలక్ష్మి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో తాగునీరు, నీడ తదితర వసతులతోపాటు ప్రథమ చికిత్సకు అవసరమైన కిట్లను అందుబాటులో ఉంచాలన్నారు. వైస్ ఎంపీపీ బీవీ రమణయ్య మాట్లాడుతూ ఉపాధి పనులను కూలీలతోనే చేయించాలన్నారు. ప్రభుత్వ పథకాల పంపిణీలో అధికార పార్టీ నేతలకు తలొగ్గి అర్హులకు అన్యాయం చేయవద్దని హితవుపలికారు. భూ రీసర్వేలో క్షేత్ర స్థాయిలో పొలంలో సాగు చేస్తున్న, అనుభవంలో ఉన్న రైతులకు అన్యాయం చేయొద్దని తహసీల్దార్ కాయల సతీష్‌కుమార్‌ను కోరారు. ప్రస్తుత రీ సర్వే వల్ల గ్రామాల్లో గొడవలు తలెత్తుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చిప్పల వెంకటయ్య, ఎంపీడీవో మనోహర్ గౌడ్, ఇరిగేషన్ ఏఈ లీలామోహన్, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర ప్రసాద్ సేవలు అభినందనీయం



ఎంఈవో-2 వెంకటేశ్వరప్రసాద్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ

చిట్టమూరు: ఈ నెలఖరును ఉద్యోగ విరమణ చేయనున్న ఎంఈవో-2 కరణం వెంకటేశ్వర ప్రసాద్ సేవలు అభినందనీయమని ఎంపీపీ సన్నారెడ్డి విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి, వైస్ ఎంపీపీ బీవీ రమణయ్య కొనియాడారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం వెంకటేశ్వర ప్రసాద్ సన్మాన సభ నిర్వహించారు. శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఆయన ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా, ఎంఈవో-2గా విద్యారంగానికి ఎనలేని సేవలు అందించారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చిప్పల వెంకటయ్య, తహసీల్దార్ కాయల సతీష్‌కుమార్, ఎంపీడీవో మనోహర్ గౌడ్, ఎంఈవో బీవీ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

తప్పనిసరిగా సర్వేలు పూర్తిచేయాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో భవాని

కలువాయి (సైదాపురం): ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలను తప్పని సరిగా పూర్తిచేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో భవాని ఆదేశించారు. ఆమె బుధవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. చైల్డ్ విత్ ఆధార్, వాహన మిత్ర, సిటిజన్ ఈకేవీసీ, హౌస్ హోల్డ్ మ్యాపింగ్, జియో ట్యాగింగ్, పీ 4 సర్వేను సకాలంలో పూర్తిచేయాలని సూచించారు. సచివాలయం సిబ్బంది నిర్లక్ష్యం వల్ల కలువాయి మండలం జిల్లాలో వెనుకంజలో ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరితగతిన సర్వేలను పూర్తి చేయాలని సూచించారు. లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ ఫజులుల్లాకు సన్మానం





కమిషనర్ షేక్ ఫజులుల్లాను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు, మున్సిపల్ కార్మిక సంఘం నేతలు

నాయుడుపేట టౌన్: నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లాకు గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1గా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తరులు ఇచ్చింది. ఈ క్రమంలో ఆయనను బుధవారం వైఎస్సార్ సీపీ నాయకులు బైనా మల్లికార్జున రెడ్డి, పేట చంద్రారెడ్డి, కటకం జయరామయ్య తదితరులు పలు పార్టీల నాయకులు, సంఘాల ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

హంస వాహనంపై కరిమాణిక్య స్వామి విహారం





హంస వాహనంపై ఊరేగుతున్న కరిమాణిక్య స్వామి, స్వామికి ఊంజల్ సేవ చేస్తున్న వేద పండితులు

నాయుడుపేట టౌన్: తుమ్మూరులోని శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్యస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామి హంస వాహనంపై సరస్వతిగా ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం టీటీడీకి చెందిన వేద పండితులు చప్పర ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, రాత్రి ఊంజల్ సేవ, ఏకాంత సేవ చేసినట్టు ప్రధాన అర్చకులు శేషాద్రి స్వామి తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి విమానోత్సవం నిర్వహించనున్నట్టు టీటీడీ అధికారులు తెలిపారు. టీటీడీ అధికారులు సుధీర్, హరిరెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చిన్నతనం నుంచే సద్గుణాలు అలవరుచుకోవాలి



మాట్లాడుతున్న మైఖేల్ బెన్‌హర్

నాయుడుపేట టౌన్: పిల్లలు చిన్నతనం నుంచే సద్గుణాలను అలవరుచుకుని ఇతరులకు సహాయపడాలని ఎస్‌ఏఎల్‌సీ మాజీ బిషప్ రెవరెండ్ ఓ మైఖేల్ బెన్‌హర్ తెలిపారు. సౌత్ ఆంధ్రా లూథరన్ చర్చి ఆధ్వర్యంలో చేపట్టిన విరామకాల బైబిల్ స్కూల్(వీబీఎస్) శిక్షణా తరగతులు ముగిశాయి. ఈ క్రమంలో బుధవారం రాత్రి చర్చి ఆవరణలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్‌ఏఎల్‌సీ ఆధ్వర్యంలో ప్రతి ఏటా 5 నుంచి 20 ఏళ్లలోపు పిల్లలకు శిక్షణా తరగతులు నిర్వహించడంతోపాటు యువకులు ఇతరులకు సహాయపడేలా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం వీబీఎస్ శిక్షణా తరగతుల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. సండే స్కూల్ కరస్పాండెంట్ ప్రేమ్‌చంద్, పీసీసీ (ప్యారిస్ కౌన్సిల్ కమిటీ) చైర్మన్ కారల్ మధు, వైస్ చైర్మన్ కాళహస్తి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

తీర ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి కృషి అభినందనీయం



ఆవుల నాగేశ్వరరావును సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేత సుధాకర్ రెడ్డి

చిట్టమూరు: ప్రభుత్వ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఆవుల నాగేశ్వరరావు చిట్టమూరు మండలంలోని తీరప్రాంత గ్రామాల్లో పాఠశాలలను ప్రారంభించి విద్యాభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ నేత దేవారెడ్డి సుధాకర్ రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం మల్లాం గ్రామ సమీపంలో ఏర్పాటుచేసిన లిటిల్ ఏంజెల్ స్కూల్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రిన్సిపాల్‌గా పనిచేసి ఎంతోమందికి విద్యాబుద్ధులు నేర్పించిన నాగేశ్వరరావు ఏడు పదుల వయసులో మళ్లీ పాఠశాలను ప్రారంభించి విద్యార్థులకు విద్య అందించాలనుకోవడం మంచి పరిణామన్నారు. అనంతరం ఆవుల నాగేశ్వరరావును సత్కరించారు. కార్యక్రమంలో దువ్వూరు కిశోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి స్థలం కబ్జా



ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి వేసిన కంచె

చిల్లకూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోయింది. స్థలం కనిపిస్తే చాలు కబ్జా చేసేస్తున్నారు. ఈ విషయం తెలిసినా రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు. మండలంలోని ముత్యాలపాడు పంచాయతీ నాంచారమ్మపేట చావడికి దగ్గరలో సుమారు 20 అంకణాల స్థలం ఉంది. అందులో పశువుల వైద్య ఉపకేంద్రం నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. బేస్‌మెంట్ వరకు నిర్మాణం చేపట్టారు. తర్వాత నిధులు రాకపోవడంతో వదిలేశారు. పదేళ్ల క్రితం అప్పటి ప్రజా ప్రతినిధులు ఆ స్థలంలో గదులు నిర్మించి అద్దెకు ఇవ్వాలని బేస్‌మెంట్‌ను తొలగించారు. గదుల నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం కూటమి నేతల కన్ను ఆ స్థలంపై పడింది. స్థలంలో గ్రావెల్ తోలి ఏకంగా కంచె వేశారు. గ్రామ నడి బొడ్డులో విలువైన స్థలం కబ్జాకు గురవుతున్నా రెవెన్యూ, పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని తహసీల్దార్ శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.